# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 16 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## టెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

### మొదటిరోజు 3,655 దరఖాస్తులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీటెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో శనివారం నుంచి ప్రారంభమైంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్‌పర్సన్ ఈ నవీన్ నికోలస్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 5,601 మంది ఫీజు చెల్లించారనీ, వారిలో 3,655 మంది దరఖాస్తు చేశారని వివరించారు. పేపర్-1కు 1,415 మంది ఫీజు చెల్లిస్తే 866 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. పేపర్-2కు 3,158 మంది ఫీజు చెల్లించగా, 2,164 మంది దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. రెండు పేపర్లకూ కలిపి 1,028 మంది ఫీజు చెల్లిస్తే 625 మంది దరఖాస్తు చేశారని వివరించారు. ఫీజు చెల్లింపుతోపాటు దరఖాస్తుల సమర్పణకు తుది గడువు ఈనెల 29 వరకు ఉన్నది. వచ్చే ఏడాది జనవరి మూడు నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో టెట్ రాతపరీక్షలు జరుగుతాయి. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

## రాహుల్‌ను కలిసిన రేవంత్, నవీన్‌యాదవ్



- జూబ్లీహిల్స్ బైపోల్‌లో విజయంపై అగ్రనేత అభినందనలు
- సీఎం వెంట మీనాక్షి నటరాజన్, భట్టి విక్రమార్క, మహేశ్‌కుమార్‌గౌడ్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విశేష విజయానంతరం సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు కీలక నేతలు ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అవుతూ ఉపఎన్నిక ఫలితాలు, ప్రచార వ్యూహాలు, శ్రేణుల స్పందనపై వివరించారు. విజయానికి కష్టపడ్డ ప్రతి ఒక్కరిని రాహుల్ అభినందించినట్లు తెలిసింది. అనంతరం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కూడా సీఎం రేవంత్ బృందం కలిసి విజయం వివరించింది.

**నవీన్ యాదవ్‌ను అభినందించిన రాహుల్ గాంధీ**

సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ఢిల్లీ వెళ్లిన జూబ్లీహిల్స్ నూతన ఎమ్మెల్యే నవీన్ యాదవ్ రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపఎన్నికలో పార్టీకి ఘనవిజయం అందించిన నవీన్‌ను రాహుల్‌కు సీఎం రేవంత్ పరిచయం చేశారు.విజయం నేపథ్యంలో పార్టీ తరఫున కష్టపడ్డ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల ఛైర్మన్ల పాత్రను కూడా రేవంత్ రాహుల్‌కు వివరించినట్లు సమాచారం. తదుపరి ఖర్గేను కలిసి జూబ్లీహిల్స్ ఫలితాలు, రాష్ట్ర రాజకీయ పరిణామాలు గురించి చర్చించారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపఎన్నిక విజయంతో ఉత్సాహంతో ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను నెక్ట్స్ టార్గెట్‌గా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎప్పుడైనా ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్ ఇప్పటికే స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చిన విషయం తెలిసిందే.జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ సాధించిన భారీ విజయం వెనుక సీఎం రేవంత్ రెడ్డి రూపొందించిన వ్యూహం కీలక పాత్ర పోషించిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# జమ్మూకశ్మీర్‌లో భారీ పేలుడు

- ఉగ్రవాదుల నుంచి స్వాధీనం చేసుకున్న పదార్థాలు పేలడంతో ప్రమాదం
- తొమ్మిది మంది మృతి
- మృతుల్లో పోలీసులు, ఫోరెన్సిక్, రెవెన్యూ అధికారులు
- 32 మందికి గాయాలు
- నౌగామ్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఘటన



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

శ్రీనగర్ సమీపంలోని నౌగామ్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించి విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో తొమ్మిది మంది మృతి చెందగా, 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వారిలో పోలీసులు, ఫోరెన్సిక్ విభాగ సిబ్బంది ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. పేలుడు తీవ్రతతో పరిసర ప్రాంతం ఒక్కసారిగా వణికిపోయింది.

**అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడిన స్టేషన్**

శుక్రవారం రాత్రి 11.22 గంటలకు భారీ శబ్దంతో స్టేషన్ ప్రాంగణం మొత్తం దట్టమైన పొగమంచులో కూరుకుపోయింది. మంటలు ఆకాశాన్నంటగా శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారని రెస్క్యూ సిబ్బంది తెలిపారు. పేలుడు తీవ్రత ఎంత తీవ్రంగా ఉందంటే 300 మీటర్ల దూరంలో కూడా శరీర భాగాలు కనిపించాయని ప్రత్యక్ష సాక్షులు వర్ణించారు. స్టేషన్‌లో నిలిపివున్న పలు వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. సమీప భవనాలకు పగుళ్లు ఏర్పడ్డాయి.

ఇటీవల హర్యానా-జమ్మూకశ్మీర్ పోలీసులు సంయుక్త ఆపరేషన్‌లో ఫరీదాబాద్‌లో స్వాధీనం చేసిన పేలుడు పదార్థాలను నౌగామ్ స్టేషన్‌కు తరలించిన సంగతి తెలిసిందే. ఆ పేలుడు పదార్థాల నుండి శాంపిల్‌లు సేకరిస్తున్న సమయంలోనే ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫోరెన్సిక్ టీమ్ నమూనాలు పరిశీలిస్తుండగా ఆచట పేలుడు సంభవించిందని అధికారులు తెలిపారు.

**మృతదేహాల గుర్తింపు క్లిష్టం**

తీవ్రంగా దహనమైన శరీర అవశేషాలను గుర్తించడం ఎనలేని కష్టంగా మారింది. శ్రీనగర్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు తరలించిన మృతదేహాలను పోస్ట్‌మార్టం, ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. గాయపడిన వారిలో 24 మంది పోలీసులు, ముగ్గురు పౌరులు ఉన్నారు. వీరికి శ్రీనగర్‌లోని ప్రభుత్వ, పోలీసు ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం.

**స్టేషన్ భవనం ధ్వంసం-రెస్క్యూ ఆపరేషన్‌లకు ఆటంకం**


పేలుడు ప్రభావంతో భవనం పెద్దఎత్తున ధ్వంసమైంది. వరుసగా చిన్న చిన్న పేలుళ్లు వినిపించడంతో కొంతసేపు రెస్క్యూ ఆపరేషన్ నిలిపివేయాల్సి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. చుట్టుపక్కల మరిన్ని పేలుడు పదార్థాలు ఉండొచ్చన్న అనుమానంతో బాంబ్ డిస్పోజల్ టీమ్‌లు అప్రమత్తంగా పనిచేశాయి. ఎన్డీఆర్ఎఫ్, ఫైరుసిబ్బంది, ప్రత్యేక దళాలు సమన్వయంతో శిథిలాలను తొలగిస్తూ చిక్కుకుపోయిన వారిని బయటకు తీశాయి.

**నౌగామ్ పేలుడు ప్రమాదవశాత్తు ఘటనే**

పేలుడు విషయంలో కేంద్ర హోం మంత్రిత్వశాఖ స్పష్టతనిచ్చింది. పేలుడులో 9 మంది మృతి చెందగా, 32 మంది గాయపడినట్లు మంత్రిత్వశాఖ శనివారం అధికారికంగా తెలిపింది. ఉగ్రదాడి కోణం ఉందనే ప్రచారంతో కలకలం రేగిన నేపథ్యంలో, ఇది పూర్తిగా ప్రమాదవశాత్తు జరిగినదేనని కేంద్ర హోం మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ లోఖండే ప్రకటించారు. "ఫరీదాబాద్‌లో టెర్రర్ మాడ్యూల్‌పై దర్యాప్తు సమయంలో స్వాధీనం చేసుకున్న భారీ పరిమాణంలో పేలుడు పదార్థాలు, రసాయనాలను నౌగామ్ స్టేషన్ ప్రాంగణంలో భద్రంగా ఉంచాం. వాటిని ప్రామాణిక విధానంలో ఫోరెన్సిక్ పరీక్షకు పంపుతున్న సమయంలోనే నవంబర్ 14 రాత్రి 11.20 గంటలకు ప్రమాదవశాత్తు పేలుడు చోటుచేసుకుంది," అని లోఖండే వివరించారు. ఈ ఘటనకు పీపుల్స్-యాంటీ ఫాసిస్ట్ ఫోర్స్ (పీఏఎఫ్ఎఫ్) బాధ్యత వహిస్తోందని ప్రకటించినప్పటికీ, ఆ ప్రకటనను జమ్మూకశ్మీర్ పోలీసులు పూర్తిగా తోసిపుచ్చారు. "వారి ప్రకటనకు ఎలాంటి ఆధారం లేదు. పేలుడు పూర్తిగా ప్రమాదవశాత్తూ జరిగింది," అని డీజీపీ స్పష్టం చేశారు.

## తెలంగాణలో పెట్టుబడులకు విన్‌గ్రూప్

- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన విన్‌గ్రూప్ ఆసియా సీఈఓ ఫామ్ సాన్ చౌ



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు విన్‌గ్రూప్ ముందుకొచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎంను విన్‌గ్రూప్ ఆసియా సీఈఓ ఫామ్ సాన్ చౌ మర్యాదపూర్వకంగా కలిశారు. తుగ్లక్ రోడ్‌లోని సీఎం అధికారిక నివాసంలో జరిగిన ఈ భేటీలో... తెలంగాణ రాష్ట్రంలో కీలక ప్రాజెక్టులను స్థాపించడానికి ఫామ్ సాన్ చౌ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) తయారీ యూనిట్లు, బ్యాటరీ నిల్వ సౌకర్యాలను ఏర్పాటు చేయాలనే ఆసక్తిని సీఎంకు వివరించారు. హైదరాబాద్ నగరం సమీపంలో ప్రభుత్వ ప్రతిపాదిత భారత్ ఫ్యూచర్ సిటీపై విన్‌గ్రూప్ ఆసియా సీఈఓ ఫామ్ సాన్ చౌ ప్రత్యేక ఆసక్తిని చూపించారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటు పట్ల సీఎం దార్శనికతను ఆయన అభినందించారు. అక్కడ అభివృద్ధిలో పెట్టుబడి పెట్టడానికి సంసిద్ధతను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిసెంబర్ 8, 9 తేదీలలో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో పాల్గొనాలని సీఎం రేవంత్ రెడ్డి.. ఫామ్ సాన్ చౌతోపాటు విన్‌గ్రూప్ చైర్మెన్ ఫామ్ నాట్ వూంగ్‌లను ఆహ్వానించారు. ఈ సమావేశంలో పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎంఓ ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, సెక్రెటరీ కోఆర్డినేషన్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ రౌడీయిజం ప్రారంభం



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బీఆర్ఎస్ కార్యకర్త రాకేశ్ క్రిస్టోఫర్‌కు పరామర్శ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడి 24 గంటలు గడవకముందే కాంగ్రెస్ పార్టీ రౌడీయిజం, గూండాగిరి ప్రారంభించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. రహమత్‌నగర్‌లో కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్త రాకేశ్‌ను కేటీఆర్ శనివారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, "కాంగ్రెస్ చేస్తున్న గూండాగిరిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. మా ప్రతి కార్యకర్తను కంటికిరెప్పలా కాపాడుకుంటాం" అని స్పష్టం చేశారు. తమ కార్యకర్తపై జరిగిన దాడికి కాంగ్రెస్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. "పదేండ్లు అధికారంలో ఉన్నా, ఎన్నో ఉప ఎన్నికలు గెలిచినా మేమెప్పుడూ ప్రత్యర్థి కార్యకర్తలపై దాడులు చేపట్టలేదు. ఈ రోజు కాంగ్రెస్ ప్రవర్తన చూస్తుంటే ప్రజాస్వామ్య విలువలు ఎక్కడో పోయాయని తెలుస్తోంది" అని కేటీఆర్ విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు, గూండాగిరి, డబ్బుల పంపిణీ ఆధారంగా జూబ్లీహిల్స్‌లో విజయం సాధించిందని ఆరోపించారు. "గత ఎన్నికల్లో మా నాయకుడు 80 వేల ఓట్లు సాధించగా, ఈసారి కుట్రలు జరిగినా 75 వేల ఓట్లు వచ్చాయి. కేవలం 5 వేల ఓట్లు మాత్రమే తగ్గాయి. భవిష్యత్తులో జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగరవేస్తాం" అని ధీమా వ్యక్తం చేశారు. '

సీఎం రేవంత్ రెడ్డి చేసిన "కేటీఆర్ అహంకారం తగ్గించుకోవాలి" వ్యాఖ్యలపై స్పందించిన కేటీఆర్, "శుక్రవారం రాత్రి కాంగ్రెస్ విజయోత్సవ ఊరేగింపే ఎవరు అహంకారంతో ఉన్నారో చెబుతోంది" అని ఎద్దేవా చేశారు. గతంలో అనేక ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచినా, కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రాలేదని గుర్తుచేశారు. "అప్పుడు ఆ పార్టీ గుర్తును గాడిదపై వేసి ఊరేగించామా?" అంటూ కేటీఆర్ చురకలంటించారు. కాంగ్రెస్ గూండాగిరి కొనసాగితే ప్రజలే బుద్ధి చెప్తారు మంగళవారం జూబ్లీహిల్స్ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ గూండాగిరిని ప్రజలు సమర్థించరని, రాష్ట్ర ప్రజలే తగిన బుద్ధి చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు.

## తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్..

### ఆర్డర్ కాపీలకు బదులుగా బెట్టింగ్ సైట్!



**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్ సైబర్ నేరగాళ్ల చేతిలో హ్యాకింగ్‌కు గురైంది. న్యాయస్థానం వెబ్‌సైట్‌లో ఆర్డర్ కాపీలు, ఇతర ముఖ్యమైన పీడీఎఫ్ ఫైళ్లను డౌన్‌లోడ్ చేయడానికి ప్రయత్నించినప్పుడు, అవి తెరుచుకోకుండా ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్ 'BDG Slot' కు దారి తీయడం కలకలం రేపింది. ఈ సాంకేతిక లోపాన్ని గమనించిన హైకోర్టు అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఈ సంఘటనపై హైకోర్టు రిజిస్ట్రార్ (ఐటీ) సైబర్ క్రైమ్ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు.

## ఇంజక్షన్ వికటించి 17 మంది చిన్నారులకు అస్వస్థత

- నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో ఘటన

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రభుత్వాస్పత్రిలో ఇంజక్షన్ వికటించి 17 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. వైద్యులు అప్రమత్తమై వైద్యం అందించడంతో వారు వెంటనే కోలుకున్నారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నాగార్జునా సాగర్ కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రిలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దగ్గు, జలుబు, జ్వరం వంటి సమస్యలతో మూడేండ్ల నుంచి 10 ఏండ్లలోపు చిన్నారులు చికిత్స తీసుకుంటున్నారు. వీరితో పాటు స్థానికంగా ఉండే చిన్నారులు సైతం శుక్రవారం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చారు. వారందరికీ యాంటీబయాటిక్ ఇంజక్షన్లు (మోనోసేఫ్) వైద్యులు ఇచ్చారు. ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న చిన్నారులు చలిజ్వరం, వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వీరితో ఇంజక్షన్ తీసుకున్న స్థానికంగా ఉండే పిల్లలు కూడా అస్వస్థతకు గురవ్వడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకుని వచ్చారు. విషయం తెలిసిన సూపరింటెండెంట్ భానుప్రసాద్ వైద్యులను, సిబ్బందిని అప్రమత్తం చేసి చికిత్స ప్రారంభించారు. ఇంజక్షన్ తీసుకున్న మిగతావారికి సైతం సిబ్బంది ఫోన్ చేసి పిలిపించి చికిత్స అందించారు. శనివారం ఉదయం వరకు పిల్లల ఆరోగ్యం సాధారణ స్థితికి చేరింది. ఒక ఇంజక్షన్‌కు బదులు మరో ఇంజక్షన్ ఇవ్వడంతోనే ఘటన చోటుచేసుకుందని తల్లిదండ్రుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. అడిషనల్ కలెక్టర్ నారాయణ అమిత్ శనివారం డీసీహెచ్ డాక్టర్ మాత్రునాయక్‌తో కలిసి ఆస్పత్రిలోని పిల్లలను పరిశీలించారు. తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ నారాయణఅమిత్ మాట్లాడుతూ.. జ్వరంతో బాధపడుతున్న పిల్లలకు సాధారణంగా ఇచ్చే యాంటీబయాటిక్ ఇంజక్షనే వేశారని తెలిపారు. ఇంజక్షన్ల విషయంలో పిల్లల తల్లిదండ్రుల ఆరోపణలను దృష్టిలో పెట్టుకుని విచారణ కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం ఉందని తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మూడ్రోజుల్లో విచారణ కమిటీ పూర్తి నివేదికను అందజేస్తుందని చెప్పారు. ఆయన వెంట పెద్దవూరు ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీదేవి, నందికొండ మున్సిపల్ కమిషనర్ వేణు, ఆస్పత్రి సూపరింటెండెంట్లు హరికృష్ణ, భానుప్రసాద్, సీఐ శ్రీనునాయక్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ ముత్తయ్య ఉన్నారు.

## పకడ్బందీగా సర్ అమలుకు చర్యలు : రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో త్వరలో చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అమలుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానా ధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్ నుంచి సర్ కార్యక్రమం పురోగతి, పెండింగ్‌లో ఉన్న ఎన్నికల సంబంధిత అంశాలపై ఈఆర్‌ఓలు, ఏఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఓటర్ జాబితా నవీకరణ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, క్షేత్రస్థాయి గుర్తింపు, డేటా ఎంట్రీ, తదితర అంశాలపై సీఈఓకు అధికారులు నివేదికలు సమర్పించారు. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి, ఓటర్ జాబితా నాణ్యతను మరింత మెరుగుపర్చే దిశగా పనిచేయాలని సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర డిప్యూటీ సీఈఓ హరిసింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వాహనాల ఫ్యాన్సీ నెంబర్ల ఫీజులు భారీగా పెంపు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో మోటారు వాహనాల ఫ్యాన్సీ నెంబర్ల ఫీజులు భారీగా పెరిగాయి. కొత్త ధరలు లక్షన్నరకు పైగానే ఉన్నాయి. తెలంగాణ మోటారు వాహనాల నిబంధనలు-1989లోని రూల్ 81ను సవరిస్తూ ప్రభుత్వం జీ.ఓ నెం. 77ను శనివారం జారీ చేసింది. ఈ సవరణలతో ఇకపై ఫ్యాన్సీ నంబర్లకు కేవలం ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి. ప్రత్యేక ఫ్యాన్సీ నెంబరైన 9999 కు రూ. 1.50 లక్షలు, 1, 9, 6666 నెంబర్లకు రూ.లక్ష, 99, 999, 3333, 4444, 5555, 7777 నెంబర్లకు రూ.50 వేలుగా నిర్ణయించారు. ఇతర నెంబర్లకు కూడా ప్రత్యేక ధరలను రవాణా శాఖ ప్రకటించింది. ఈ మేరకు ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్ శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు.

## నేడు తెరుచుకోనున్న శబరిమల అయ్యప్ప ఆలయం

**బలగం టీవి, శబరిమల**

అయ్యప్ప భక్తులకు శుభవార్త. మండల-మకరవిళక్కు సీజన్ ప్రారంభం నేపథ్యంలో శబరిమల అయ్యప్ప ఆలయం ఈరోజు (ఆదివారం) సాయంత్రం 5 గంటలకు తెరుచుకోనుంది. ప్రధాన అర్చకుడు కందరారు మహేశ్ సమక్షంలో ఆలయ ద్వారాలు తెరవనున్నారు. భక్తుల సౌకర్యం, భద్రత కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. సాయంత్రం ప్రారంభ పూజను ప్రధాన పూజారి అరుణ్‌కుమార్ నంబూద్రి నిర్వహిస్తారు. ఆచారబద్ధంగా శ్రీకోవిల్ నుంచి తెచ్చిన పవిత్ర జ్వాలతో 18 మెట్ల వద్ద 'అధి' (పవిత్ర మంట) వెలిగిస్తారు. అనంతరం సాయంత్రం 6.30 గంటలకు అభిషేకం జరుగుతుంది. వృశ్చిక మాసం ఆరంభం సందర్భంగా సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు పూజారులు ఆలయాన్ని తిరిగి తెరిచి, ఆ సమయం నుంచే భక్తులకు అధికారికంగా అయ్యప్ప దర్శనం అనుమతించనున్నారు. మండల-మకరవిళక్కు సీజన్ ఏర్పాట్లను ట్రావెన్కోర్ దేవస్వం బోర్డు (టీబీడీ) కొత్తగా నియమిత పరిపాలనా కమిటీ పర్యవేక్షిస్తోంది. కె. జయకుమార్ %-టీబీడీ అధ్యక్షుడు, కె. రాజు %-% బోర్డు సభ్యుడు బంగారు తాపడం వివాదం నేపథ్యంలో వీరు బాధ్యతలు స్వీకరించారు. రాబోయే రెండేళ్లపాటు ఈ పదవుల్లో కొనసాగనున్నారు. దర్శన టికెట్లు: రోజుకు 70 వేల ఆన్‌లైన్, 20 వేల స్పాట్ బుకింగ్ అయ్యప్ప దర్శనం కోసం ఆన్‌లైన్ బుకింగ్ తప్పనిసరి. రోజూ: 70,000 మంది %-% ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా, 20,000 మంది - స్పాట్ బుకింగ్ ద్వారా



స్పాట్ బుకింగ్ కేంద్రాలు : పంబా, నీలక్కల్, ఎరుమేలి, వండిపెరియార్ సత్రం, చెంగన్నూర్.

ఓటీఎస్ రద్దు అయిన ఆన్‌లైన్ టికెట్లను లైవ్ బుకింగ్ కోటాలోకి మార్చి మరిన్ని భక్తులకు అవకాశం ఇస్తారు.

బుకింగ్ వెబ్‌సైట్: sabarimalaonline.org

**ఆలయ దర్శన సమయాలు**

నవంబర్ 17 (సోమవారం) నుంచి:

ఉదయం 3 గంటలు %-% మధ్యాహ్నం 1 గంట

మధ్యాహ్నం 3 గంటలు %-% రాత్రి 11 గంటలు

పూజలు, ప్రసాదాల ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభం

ప్రసాదాలను కూడా ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. వర్చువల్ క్యూ వ్యవస్థ కూడా ప్రారంభమైంది.

మండల పూజ ముగింపు: డిసెంబర్ 27

ఆలయం మూసివేత: డిసెంబర్ 27 రాత్రి 10 గంటలకు మకరవిళక్కు కోసం తిరిగి తెరవడం: డిసెంబర్ 30 మకరజ్యోతి దర్శనం: జనవరి 14, 2026 ఆలయం మూసివేత: జనవరి 20, 2026

## కొమురవెల్లి బ్రహ్మోత్సవాలకు వైభవంగా ఏర్పాట్లు చేయాలి

- సిద్దిపేట కలెక్టర్ హైమావతి
- డిసెంబర్ 14న కళ్యాణం
- జనవరి 18 నుంచి మార్చి 16 వరకు జాతర



**బలగం టీవి, సిద్దిపేట**

కొమురవెల్లి శ్రీ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన సమన్వయ సమావేశంలో ఈ విషయాన్ని ఆమె సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ, డిసెంబర్ 14, 2025న ఉదయం 10.45 గంటలకు స్వామివారి కళ్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం జనవరి 18, 2026 నుండి మార్చి 16, 2026 వరకు ప్రతి ఆదివారం, బుధవారం జాతర ఉంటుంది అని పేర్కొన్నారు.

జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచే కాదు, హైదరాబాదు, సికింద్రాబాద్ ప్రాంతాల నుండి కూడా అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశమున్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. మేడారం సమ్మేళనం కూడా ఉండటంతో రెండు ప్రాంతాలకు వచ్చే భక్తుల రద్దీ పెరిగే అవకాశముందని, జాతర ప్రాంతంలో సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు సరైన బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలి.

పోలీస్ కంట్రోల్ రూమ్‌లో మైక్ అనౌన్స్‌మెంట్‌లు నిరంతరం చేయాలి. లడ్డు కౌంటర్ల సంఖ్యను పెంచి భక్తుల గుమికూడుడు తగ్గించాలి. క్యూ లైన్‌లను పకడ్బందీగా నిర్వహించాలి. వివిధ ప్రాంతాల్లో అన్నదానం ఏర్పాటుతో రద్దీని నియంత్రించాలి. విధులు నిర్వర్తించే సిబ్బందికి భోజన వసతి అందుబాటులో ఉండాలి.

జాతర కాలంలో అత్యవసర, సాధారణ వైద్యసేవల కోసం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి, వైద్య సిబ్బందిని 3 షిఫ్టుల్లో 24 గంటలూ అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అవసరమైన మందులు, అంబులెన్స్‌లను కూడా సిద్ధంగా ఉంచాలని అన్నారు.పారిశుద్ధ్యం, త్రాగునీరు, మద్యం విక్రయాల నియంత్రణ. రోజంతా మూడు షిఫ్టుల్లో పారిశుద్ధ్యాన్ని నిరంతరంగా నిర్వహించాలని సూచించారు త్రాగునీటి సమస్య రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి. జాతర ప్రాంతంలో మద్యం విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ం పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన రోడ్ల నిర్మాణాలు, ఇతర పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సమస్యలు, ప్రమాదాలు ఎదురుకాకుండా ముందస్తు మరమ్మతులు చేసి, అవసరాన్ని బట్టి అదనపు ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక వాహనాలు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా కలెక్టర్ అబ్దుల్ హమీద్, అడిషనల్ డీసీపీ కుశాల్కర్, హుస్నాబాద్ ఏసీబీ సదానందం, ఆలయ ఈవో వెంకటేశ్వర్, ఎక్సైజ్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్టీసీ, నీటి, వైద్య, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 42 వేల కేసుల పరిష్కారం

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో నిర్వహించిన స్పెషల్ లోక్ అదాలత్‌లో 42.063 కేసులు పరిష్కారమైనట్టు లోక్ అదాలత్ మెంబర్ సెక్రెటరీ సీహెచ్.పంచాక్షరి ప్రకటించారు. ఇందుకు సంబంధించి శనివారం ఆమె ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ మార్గదర్శకత్వంలో కింది స్థాయి నుంచి హైకోర్టు వరకు అన్ని కోర్టులు కేసుల పరిష్కారానికి కృషి చేశాయన్నారు. ఇందులో 37,055 పెండింగ్ కాంపౌండబుల్ క్రిమినల్, 3,217 పెండింగ్ ఎన్ఐయాక్ట్, 1,889 ఇతర కేసులు పరిష్కారమైనట్టు ప్రకటించారు.

## ఐ బొమ్మ నిర్వాహకుడు అరెస్ట్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎట్టకేలకు 'ఐ బొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవిని పోలీసులు అరెస్ట్ చేసినట్టు తెలిసింది. బెట్టింగ్, గేమింగ్ యాప్ మాఫియాలతో కుమ్మక్కైన ఇమ్మడి రవి ఆరు సంవత్సరాల కాలంలో వేలాది పైరసీ సినిమాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. రవి కారణంగా టాలీవుడ్ నిర్మాతలకు వేలాది కోట్ల రూపాయలు నష్టం వాటిల్లింది. కొద్ది నెలల క్రితం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫిర్యాదు మేరకు ఐ బొమ్మతోపాటు, 65 పైరసీ వెబ్‌సైట్‌లపై కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో కొద్దినెలల క్రితం ఐదుగురు పైరసీ నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు. అయితే తనను పట్టుకోలేరంటూ హైదరాబాద్ పోలీసులకు రవి సవాల్ విసిరాడు. 2019 నుంచి 'ఐ బొమ్మ' వెబ్‌సైట్‌లో పైరసీ చేసిన వీడియోలు అప్‌లోడ్ చేస్తున్న రవి ఇంతకాలం పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు.చివరకు సీసీఎస్ పోలీసులు శనివారం రవిని అదుపులోకి తీసుకున్నారు. వైజాగ్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఓ అపార్టుమెంట్‌లో నివాసముంటున్న రవి ఇంట్లో నుంచి వందల హార్డ్ డిస్క్‌లు, పెద్దఎత్తున కంప్యూటర్లు, పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. రవి ఉపయోగించిన సర్వర్లను సైతం పోలీసులు గుర్తించినట్టు సమాచారం నిందితుడిని నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు.

# ఇందిరమ్మ ఇండ్లతో నెరవేరుతున్న సొంతింటి కల..

- ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగించుకొని ఇళ్లు పూర్తి చేసుకోవాలి..
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- అనంతారంలో ఇందిరమ్మ ఇంటిలో గృహ ప్రవేశం
- హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంతో సొంత ఇంటి కల నెరవేరుతున్నదని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.

**ఫిల్లర్ రూఫింగ్ తో ఖర్చు ఆదా..**

ఈ సందర్భంగా ఇల్లంతకుంటలో ఉన్న 40, ఓబులాపూర్ లో 24 ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేసి, ప్రొసీడింగ్స్ ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ పంపిణీ చేశారు. హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ ను ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ కలిసి ప్రారంభించారు. ఇంటిలో వాతావరణం చల్ల బరిచేందుకు, నిర్మాణ ఖర్చు తగ్గించేందుకు ఫిల్లర్ రూఫింగ్ విధానంలో పూర్తి చేయడాన్ని చూసి అభినందించారు.

అనంతారం గ్రామంలో గన్నెపల్లి అనూష అనే లబ్ధిదారు ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకోగా, నూతన గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే, ఇంచార్జి కలెక్టర్ హాజరయ్యారు. గృహ ప్రవేశం చేసి, లబ్ధిదారుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. ఇల్లంతకుంట ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల స్వంత ఇంటి కల నెరవేరుతున్నదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని వెల్లడించారు. నాలుగు విడతల్లో రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం ప్రభుత్వం మంజూరు చేస్తుందని వెల్లడించారు. వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు బాధ్యతలు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. తుది దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసి, గృహ ప్రవేశానికి ఆహ్వానించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ శశికళ, హౌసింగ్ డీఈ ఖాజా ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

# పెంచే స్థోమత లేని పిల్లల్ని దత్తత కోసం అప్పగించవచ్చు..

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- దత్తత మాసం పై సమీక్ష



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కొన్నిసార్లు పిల్లలను పెంచే స్థోమత లేనటువంటి తల్లితండ్రులు తమ పిల్లల్ని దత్తత కోసం అప్పగించవచ్చని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. కొందరు తల్లితండ్రులు పిల్లలను రోడ్డు మీద వదిలేస్తున్నటువంటి సందర్భాలను మనం చూస్తున్నాం కాబట్టి ప్రభుత్వం ఇలాంటి పిల్లల కోసం ఒక చక్కని మార్గాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం దత్తత కోసం చాలామంది ఎదురుచూస్తున్నారు కాబట్టి ఎవరికైనా పిల్లలు పెంచే శక్తి లేనట్లయితే వారు వద్దు అనుకున్నట్లయితే పిల్లలని ప్రభుత్వ శిశు సంరక్షణ కేంద్రాలకు అప్పగించాలని, వారిని చట్ట ప్రకారం దత్తతకు పంపిస్తామని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. దత్తత అవగాహన మాసం సందర్భంగా ఈ విధానం ఆమె సమీక్ష సమావేశం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం నిర్వహించారు. దత్తత గురించి సూచనలు అందించడం జరిగింది. ఎవరికైనా అవాంఛత గర్భం వచ్చినట్లయితే లేదా పెంచే శక్తి లేకుండా ఉన్నట్లయితే వారిని చెట్ల పొదలలో అక్కడ ఇక్కడ పడవ వేయడానికి బదులుగా ప్రభుత్వ నిర్దేశిత ప్రదేశాల్లో సరెండర్ చేయాలని, లేదా ప్రభుత్వం నిర్దేశిత స్థలాల్లో లేదా బాలల సంక్షేమ సమితి సిడబ్ల్యుసి కి అప్పగించాలని సూచించారు. పిల్లలను అప్పగించినట్లయితే దేశంలో చాలామంది దత్తత కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులకు చట్టప్రకారం అందించడం జరుగుతుందని తెలిపారు. దీంతో ఆ పిల్లలకు మంచి జీవితాన్ని, వెలుగులు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ మాసం దత్తత అవగాహన మాసం కాబట్టి ఈ సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం,జిల్లా బాలల హక్కుల అధికారి కవిత, ప్రొటెక్షన్ ఆఫీసర్ గగన్ పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- బ్యాంకింగ్ సమాచారం ఎవరితో పంచుకోవద్దు..
- సైబర్ నేరానికి గురైతే ట్రోల్ ఫ్రీ నంబర్ 1930కి పిర్యాదు చేయాలి
- గడిచిన సంవత్సర కాలంలో జిల్లాలో 64 కేసులు నమోదు, రూ. 54,97,683/- రికవరీ బాధితులకు అందజేత..
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

డిజిటల్ యుగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త మార్గాల్లో ప్రజలను మోసగిస్తున్నారని, వారి బారిన పడకుండా అప్రమత్తతే ప్రధాన ఆయుధం అని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. అత్యాశకు పోయి వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని ఆయన ప్రజలకు సూచించారు.

సైబర్ నేరాల నివారణలో ప్రజల సహకారం అత్యంత కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. మోసగాళ్లు ఫోన్ కాల్స్, సోషల్ మీడియా, బ్యాంకింగ్ యాప్స్, డిజిటల్ అరెస్ట్, ఫేక్ లింకులు, లక్కీ డ్రాలు, ఇన్వెస్ట్‌మెంట్ ఆఫర్లు వంటి అనేక మార్గాల్లో ప్రజల డేటా, డబ్బును అపహరించడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి, సైబర్ మోసాల నివారణకు కృషి చేయాలని సూచించారు.

జిల్లాలో సైబర్ నేరాలను అరికట్టడంలో సైబర్ క్రైమ్ టీమ్, సైబర్ వారియర్లు పకడ్బందీగా వ్యవహరిస్తున్నారని ఎస్పీ తెలిపారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి, ఆధునిక సాంకేతికత ఆధారంగా విచారణ ప్రారంభించడం జరుగుతోందన్నారు. గడిచిన సంవత్సర కాలంలో జిల్లాలో 64 సైబర్ కేసులు నమోదు అయ్యాయి. వచ్చిన సైబర్ ఫిర్యాదులలో వెంటనే స్పందించి రూ. 36,29,853/- ఫ్రీజ్ చేయబడింది, బాధితులు కోల్పోయిన మొత్తం ?54,97,683/- రూపాయలను రికవరీ చేసి వారికి తిరిగి అందజేయడం జరిగిందని ఎస్పీ వెల్లడించారు. సైబర్ క్రైమ్ టీమ్, సైబర్ వారియర్లు గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులను సందర్శిస్తూ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా జిల్లా వ్యాప్తంగా సైబర్ భద్రతపై అవగాహన పెంపొందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు.

సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు పాటించాల్సిన ముఖ్య సూచనలు.. అనవసర కాల్స్/తెలియని లింకులను నమ్మవద్దు, బ్యాంక్ OTP, PIN, CVV వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ చెప్పొద్దు, రుణ యాప్స్, ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్స్ పేరుతో వచ్చే సందేహాస్పద ఆఫర్లను నమ్మొద్దు, ఫేక్ ప్రొఫైల్స్, %క్యూ%ఆర్% కోడ్స్, ఫేక్ జాబ్ ఆఫర్లను గుర్తించి వాటికి దూరంగా ఉండండి, సైబర్ నేరానికి గురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సూచనలను పాటించడం ద్వారా సైబర్ నేరాల నుండి సురక్షితంగా ఉండవచ్చని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ప్రజా పాలనకే ప్రజలు మొగ్గు



- వేములవాడ పట్టణ కాంగ్రెస్ నాయకులు

**బలగం టీవీ, వేములవాడ**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను దాదాపు 25 వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిపించి, ప్రజా పాలనకే తమ మొగ్గును స్పష్టంగా చాటారని వేములవాడ పట్టణ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడం పట్ల శుక్రవారం వేములవాడలోని తిప్పాపూర్ బస్టాండ్‌లో కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చి ఘనంగా సంబరాలు చేసుకున్నారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి పరిపాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు సమృద్ధిగా అందుతున్నాయని, ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో కేటీఆర్ 'హైడ్రా' పేరుతో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినప్పటికీ, ప్రజలు వాటిని పట్టించుకోకుండా కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారని అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ మాటలను ప్రజలు విశ్వసించలేదని, జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఓటర్లు నిరూపించారని వారు ఉద్ఘాటించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందడానికి జూబ్లీహిల్స్ విజయం శుభసూచకమని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, నాయకులు కూరగాయల కొమరయ్య, వస్తాది కృష్ణ, అన్నారం శ్రీనివాస్, ఇప్పపుల అజయ్, పుల్కం రాజు, పులి పులి రాంబాబు, నాగుల రాము, ముంజ ఉపేందర్, కోయల్ కార్ మస్తాన్, కోలాకాని రాజు, అబ్దుల్ రజాక్, కట్కూరు శ్రీనివాస్, నాగుల విష్ణు, నాగుల రవీందర్, కొక్కుల బాలు, అంబాటి చందు, సాబీర్, మర్రిపల్లి రాజు, జగదాంబ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల అద్భుత తీర్పు..

- మూడ్ ఆఫ్ ది నేషన్ కు ప్రతిబింబం

**బలగం టీవీ, బోయినిపల్లి:**

బీహార్ ఎన్నికల్లో వరుసగా మరోమారు విజయం సాధించిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసి, సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోడీ సమర్థ నాయకత్వం, ఎన్డీయే పట్ల నిరంతరం పెరుగుతున్న ప్రజాదరణకు బీహార్ తీర్పు అద్దం పట్టింది.అభివృద్ధి, సంక్షేమంతో దేశాన్ని ముందుకు నడిపిస్తున్న ప్రధాని మోదీకే తమ మద్దతు అని బీహార్ ప్రజలు మరోసారి స్పష్టం చేశారు. వికసిత భారతం మాత్రమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ముందుకు సాగుతున్న ఎన్డీఏ కూటమి బీహార్ ఎన్నికల్లో వరుసగా మరోమారు సాధించిన విజయం ప్రత్యేకమైనది. అనునిత్యం పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తూ ఎన్నికల రణరంగంలో విజయవంతంగా పోరాడిన భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు, నాయకులకు నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, మాజీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు బొంగని అశోక్ గౌడ్, జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి, కొన్నం శ్రీనివాస్ రెడ్డి , సారంపల్లి రాజు, పాలోజు రాజేంద్రప్రసాద్, కళ్యాణ అనిల్, రాజూరి కిరణ్, ఇల్లందుల బాలయ్య, రమేష్ , రంజిత్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పెద్దూరు పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఎంపీహెచ్ఎస్ పెద్దూరు పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థిని విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి చాలా చక్కగా పాఠాలను బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా వ్యాయామ ఉపాధ్యాయులుగా, అటెండర్లుగా విద్యార్థులే వ్యవహరించీ, పాఠశాలను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు అంబటి రవీందర్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని, కఠిన శ్రమ, పట్టుదల లేనిదే ఏదీ సాధించలేమని, ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తే ధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని విద్యార్థులకు సూచించారు. తర్వాత అత్యుత్తమంగా బోధించిన ఒక రోజు ఉపాధ్యాయులకు బహుమతులను పంపిణీ చేశారు. సీనియర్ ఉపాధ్యాయులు చక్రవర్తుల రమాదేవి మరియు ఉపాధ్యాయ బృందం గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, జనగాం రాజమల్లు, బైరి వాణిశ్రీ, కడార్ల కల్పన ,నాగుల వీణ, నందాల శంకర్, ఒకరోజు ప్రధానోపాధ్యాయురాలు మోటం అనురాధ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు..

## మద్యం తాగి వాహనాలు నడిపిన 37 మందికి జరిమాన

- ఎల్లారెడ్డిపేట ఎస్సై కే. రాహుల్ రెడ్డి

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండలంలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి, మద్యం సేవించి వాహనాలు నడిపిన 37 మందిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఎల్లారెడ్డిపేట ఎస్సై కే. రాహుల్ రెడ్డి నేతృత్వంలో కేసు నమోదు చేయబడిన ఈ 37 మందిని ఈరోజు సిరిసిల్లలోని గౌరవ IIక్లాస్ మేజిస్ట్రేట్ జయశ్రీ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి జరిమానా విధించారు. 32 మందికి జరిమానా విధించగా, అందులో 29 మందికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున, ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున, మరియు ఒకరికి రూ.2000 జరిమానా విధించారు. ఫోర్ వీలర్ వాహనదారులు (కారు) 05 మందికి ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై కే. రాహుల్ రెడ్డి మాట్లాడుతూ.. వాహనదారులు ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపినా, లేక బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలంతా ట్రాఫిక్ నిబంధనలను పాటించి, సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు.



## తల్లిదండ్రుల మృతితో అనాథలైన అక్కాచెల్లెళ్లు

- దహన సంస్కారాలకు సైతం డబ్బుల్లేని దీనస్థితి
- తంగళ్లపల్లి మండలం మండేపల్లి కేసీఆర్ నగర్‌లో విషాద ఘటన

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కన్నవారు లేక అనాథలైన ఇద్దరు అక్కాచెల్లెళ్ల జీవితాలు విషాదంలో మునిగిపోయాయి. లాలించే అమ్మ లేదు, ఆలనా పాలనా చూసే నాన్న లేరు. ఇటీవల తండ్రి మరణించగా, ఇప్పుడు తల్లి కూడా అనారోగ్యంతో కన్నుమూయడంతో ఆ ఇద్దరు కూతుళ్లు ఒంటరివారయ్యారు.

తంగళ్లపల్లి మండలం, మండేపల్లిలోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీ కి చెందిన నిరుపేద మహిళ దండి లావణ్య అనారోగ్యంతో మృతి చెందారు. అయితే, ఆమె భర్త దండి శ్రీనివాస్ సైతం కొన్ని నెలల క్రితమే అనారోగ్యంతో మరణించడం జరిగింది. తల్లిదండ్రులు ఇద్దరూ అకాల మరణం చెందడంతో వారి ఇద్దరు కూతుళ్లు- శివాని, శ్రావణి అనాథలయ్యారు. దహన సంస్కారాలకు సైతం డబ్బుల్లేని దుస్థితిలో ఉన్న ఈ కుటుంబానికి గ్రామస్థులు మరియు దాతలు సహాయం చేయాలని కోరుతున్నారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.10,000/- ఆర్థిక సహాయం అందజేశారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు దూడం శంకర్, బీఆర్?ఎస్? పార్టీ నాయకుడు బొల్లి రామ్మోహన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డా. బాలయ్య, మోర రవీందర్ మరియు సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.



## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు..

- ఆల్మాస్‌పూర్‌లో ఘనంగా బాలల దినోత్సవం, స్వయం పరిపాలన వేడుకలు
- జెడ్పీహెచ్ఎస్ ఆల్మాస్‌పూర్ ప్రధానోపాధ్యాయులు పూదరి కుమార స్వామి

**బలగం టీవీ, ఆల్మాస్‌పూర్**

భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నవంబర్ 14న జరుపుకునే బాలల దినోత్సవాన్ని జెడ్పీహెచ్ఎస్ ఆల్మాస్‌పూర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, వివిధ విద్యాధికారులుగా బాధ్యతలు నిర్వర్తించారు. విద్యార్థిని మనస్విని ప్రధానోపాధ్యాయురాలిగా, శ్రీపాల్ జిల్లా విద్యాధికారిగా, శ్రీనిధి మండల విద్యాధికారిగా వ్యవహరించారు. పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల్లో బోధన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో, ఉత్తమ బోధన చేసిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూదరి కుమార స్వామి మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే చక్కని క్రమశిక్షణను అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో మంచి స్థాయిలో స్థిరపడాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్రామిరెడ్డి, మల్లికార్జున్, మల్లారెడ్డి, సంపూర్ణ భవాని, భాస్కర్, దివ్య, దేవేందర్ తదితరులు, అలాగే ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తి లక్ష్యం చేరాలి..

- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వ ఆర్డర్లు అందిస్తాం..
- మార్కెట్‌కనుగుణంగా ముందుకు వెళ్లాలి
- అందరూ భీమా పథకాలలో చేరాలి
- సిరిసిల్ల జిల్లా కేంద్రంలో యధావిధిగా చేనేత జౌళి శాఖ కార్యాలయం సేవలు
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



మహిళా సంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి యూనిఫాం చీరల క్లాత్ ఆర్డర్ లక్ష్యం చేరాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో చేనేత జౌళి శాఖ అధికారులు, వస్త్ర పరిశ్రమ కార్మికులు, ఆసాములు, యజమానులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఇందిరా మహిళా శక్తి యూనిఫాం చీరల క్లాత్ ఆర్డర్ కేటాయింపు, ఉత్పత్తిపై మాక్స్ సొసైటీలు వారీగా సమీక్షించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఆర్డర్ ప్రకారం వస్త్ర పరిశ్రమ బాధ్యులు ఈ నెల 24 వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని ఆర్డర్లు అందిస్తామని స్పష్టం చేశారు. అలాగే పరిశ్రమ బాధ్యులు సైతం మార్కెట్ ఆర్డర్లు పొందేలా ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్మికుల విజ్ఞప్తి మేరకు ఐ డీ ఓ సీ లో ఉన్న చేనేత జౌళి శాఖ కార్యాలయం సిరిసిల్లలోని కార్యాలయానికి తరలిస్తామని తెలిపారు.వస్త్ర పరిశ్రమలోని వారందరూ నేతన్న భద్రత, నేతన్న భరోసా పథకాల్లో నమోదు కావాలని సూచించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజనలో నమోదు కావాలని కోరారు. దీంతో వారి కుటుంబాలకు ఎంతో భరోసాగా ఉంటుందని, ఈ నెల 18, 19 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు పెట్టి అర్హులందరిని చేర్పించాలని ఆదేశించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కింద అమలు అవుతున్న పథకాల పూర్తి సమాచారం, సబ్సిడీ వివరాలతో కూడిన పంప్లేట్లు సిద్ధం చేసి, వస్త్ర పరిశ్రమ వారికి అందించాలని సూచించారు. ఆధునికత పై అవగాహన పెంచుకొని, నూతన పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలని పేర్కొన్నారు. విద్యుత్, పాత బకాయిల విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ ఏడీ రాఘవరావు, డీఆర్డీఓ శేషాద్రి, ఎల్డీఎం మల్లికార్జున రావు, అధికారులు, సిబ్బంది, వస్త్ర పరిశ్రమ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల హక్కులకు డీఎల్ఎస్ఏ ప్రత్యేక కృషి..



- చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

చిన్నారులకు సమాన హక్కులు కల్పించడం, వారికి అవసరమైన రక్షణ మరియు సహాయాన్ని చేరువ చేయడమే లక్ష్యంగా జిల్లా న్యాయ సేవాధికర సంస్థ నిరంతరం కృషి చేస్తోందని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ టి. పర్శరాములు అన్నారు. బాలల దినోత్సవంను పురస్కరించుకొని శుక్రవారం తంగళ్లపల్లి మండలంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన తెలంగాణ గిరిజన సంక్షేమ అప్‌గ్రేడ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పుష్పలత ఆదేశాలు, మరియు సీనియర్ సివిల్ జడ్జి/కార్యదర్శి, %ఖూూూ% పి.లక్ష్మణాచారి సమన్వయంతో ఈ సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిల్లలు భారతదేశ భవిష్యత్తు అని, కాబట్టి బాలల హక్కులను ప్రతి ఒక్కరు గౌరవించాలని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్. మల్లేష్ యాదవ్, లోక్ అదాలత్ సభ్యులు/న్యాయవాదులు ఆడెపు వేణు, గుర్రం ఆంజనేయులు, గిరిజన సంక్షేమ కళాశాల ప్రధానోపాధ్యాయురాలు పి. రజని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగించుకోవాలి

- తల్లి పోషకాహారం తీసుకోవాలి.. కుటుంబంలోని అందరూ ఆరోగ్యంగా ఉంటారు..
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- గంభీరావుపేట లో అంగన్వాడీ కేంద్రం ప్రారంభం

**బలగం టీవీ, గంభీరావుపేట**



గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. గంభీరావుపేటలో రూ. 14 లక్షల నిధులతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు. అంగన్వాడిల్లో చదివే విద్యార్థులకు కుట్టించిన యూనిఫాంలను, పోషకాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ప్రతి చిన్నారికి సమీప అంగన్వాడీ కేంద్రాల్లో చదవాలని, కేంద్రాల్లో అందించే కోడి గుడ్లు, బాలామృతం, అన్నం ఇతర పోషకాహారాన్ని వారికి తినిపించాలని సూచించారు. ఆరోగ్యంగా ఉన్న పిల్లలు ఆటల్లో, చదువులో రాణిస్తారని వివరించారు. పిల్లలు బడి బయట ఉండవద్దని, రోజూ అంగన్వాడీ కేంద్రాలకు రావాలని, చేతులు శుభ్రం చేసుకోవాలని, తినాలని, ఆడుకోవాలని సూచించారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి, అంగన్వాడిలో మూడు నెలలపాటు పోషకాహారం ఇవ్వాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు మునగ ఆకు, నువ్వులు, ఇతర కూరగాయలు, కోడి గుడ్లు, పాలు ఆహారంలో భాగం చేసుకుంటే మందులు అవసరం ఉండదని స్పష్టం చేశారు. ప్రతి ఇంట్లో మహిళలు పోషకాహారం తీసుకోవాలని, వారు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం అంతా బాగుంటుందని తెలిపారు.



**ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన**

గంభీరావుపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ధాన్యం నిల్వాలు పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఇప్పటిదాకా ఎన్ని క్వింటాళ్ల ధాన్యం రైస్ మిల్లులకు తరలించారో అధికారులతో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకే రోజులో 15 వికెట్లు

- 189 పరుగులకు ఆలౌట్
- రెండో రోజు ఆట ముగిసే సమయానికి 93/7
- జడేజా ధాటికి సఫారీలు కుదేలు

**బలగం టీవీ, కోల్‌కతా**

ఈడెన్ గార్డెన్స్ పిచ్ రెండో రోజునుంచే బౌలర్లకు ఔన్నత్యం కలిగించడంతో భారత్–దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న రెండో టెస్టు ఆసక్తికర దశలో అడుగుపెట్టింది. తొలి ఇన్నింగ్స్‌లో స్పిన్‌కు బలై 189 పరుగులకే ఆలౌట్ అయిన భారత్ బౌలర్ల మాయాజాలంతో రెండో ఇన్నింగ్స్‌లో మ్యాచ్‌పై పట్టు సాధించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి సఫారీలు 93/7తో ఆడుతుండగా, వారికి 63 పరుగుల ఆధిక్యం మాత్రమే ఉంది. కెప్టెన్ టెంబా బవుమా (29) ఒంటరిగా పోరాడుతున్నాడు.

**జడేజా–కుల్‌దీప్ ధాటికి సఫారీలు కంగారు**

భారత స్పిన్నర్లు రెండో రోజు పిచ్ మలుపును అద్భుతంగా సద్వినియోగం చేసుకున్నారు. రవీంద్ర జడేజా 4/29, కుల్‌దీప్ యాదవ్ 2/12తో దక్షిణాఫ్రికా బ్యాటర్లను చకచకా పెవిలియన్ దారి పట్టించారు. 9వ ఓవర్లో బౌలింగ్‌కు వచ్చిన జడేజా మార్క్మ్ (4), మల్డర్ (11), టోని డీ జార్జీ (2), స్టబ్స్ (5) వారిని వరుసగా పెవిలియన్‌కు పంపి సఫారీ జట్టును కుదేలు చేశాడు. అక్షర్ పటేల్ కూడా వెరీన్ (9), యాన్సెన్ (13) వికెట్లు తీశాడు.

**హర్మర్ మాయ బంతులకు భారత్ కుప్పకూలింది**



అంతకుముందు మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ స్పిన్‌కు ఎదురులేక బ్యాటింగ్‌లో తడబడింది. ఓవర్‌నైట్ స్కోరు 37/1 నుంచి 189కు ఆలౌట్ అయ్యింది. సైమన్ హర్మర్ 4/30, యాన్సెన్ 3/35తో భారత బ్యాటింగ్‌ను చిత్తు చేశారు. రాహుల్ (39), సుందర్ (29) కొంత ప్రతిఘటించినా ఫలితం లేకపోయింది. గిల్ మెడనొప్పితో రిటైర్డ్%–%హర్ట్ కావడం టీమ్‌ఇండియాకు మరో షాక్. అనంతరం అతడిని స్ట్రెచర్‌పై ఆసుపత్రికి తరలించారు.

రెండో రోజు నుంచే పిచ్ బంతికి గిర్రున తిరుగుతుండటంతో మ్యాచ్ త్వరగా ముగిసే అవకాశం ఏర్పడింది. ఈ వేదికపై 130 – 150 పరుగుల లక్ష్యమే అయినా చిరాకే! ఎవరి వైపు ఫలితం మొగ్గుతుందో స్పష్టత రానప్పటికీ భారత బౌలర్లు దూకుడు చాటుతున్నారు.

**జడ్డూకి అరుదైన ఘనత**

ఈ టెస్టుతో 300 టెస్ట్ వికెట్లు 4 వేల పరుగులు పూర్తి చేసిన రెండో భారత ఆటగాడిగా జడేజా నిలిచాడు. ఈ విభాగంలో ముందు కపిల్‌దేవ్ ఉన్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ మైలురాయిని అందుకున్న నాలుగో ఆటగాడు జడేజా.

**సంక్షిప్త స్కోర్లు**

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 159 ఆలౌట్

భారత్ తొలి ఇన్నింగ్స్: 189 ఆలౌట్ (రాహుల్ 39, సుందర్ 29, హర్మర్ 4/30, యాన్సెన్ 3/35)

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 93/7, 35 ఓవర్లు (బవుమా 29బి, యాన్సెన్ 13బీ జడేజా 4/29, కుల్‌దీప్ 2/12)

# ఐపీఎల్ ఫ్రాంచైజీల రిటెన్షన్, రిలీజ్ లిస్టులు విడుదల

- షమీని ట్రేడ్ చేసిన హైదరాబాద్

**బలగం టీవీ, హైదరాబాద్**

2026 సీజన్‌కు సంబంధించిన రిటెన్షన్ గడువు ముగియడంతో మొత్తం 10 ఫ్రాంచైజీలు తాము ఉంచుకున్న మరియు వదిలేసిన ఆటగాళ్ల జాబితాలను అధికారికంగా ప్రకటించాయి. సోషల్ మీడియాలో ఒక్కొక్క జట్టు తమ లిస్టలను బయటపెట్టగా, తెలుగు జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక ఆటగాళ్లను రిలీజ్ చేసింది. ముఖ్యంగా మహ్మద్ షమీ ట్రేడ్ ఔట్, రాహుల్ చాహర్ రిలీజ్ చేయడం విశేషం.

**సన్‌రైజర్స్ హైదరాబాద్**

**రిటైనెడ్ ప్లేయర్లు:**

పాట్ కమిన్స్, అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్, ట్రావిస్ హెడ్, హర్షల్ పటేల్, ఇషాన్ కిషన్, జీషాన్ అన్సారీ, జయదేవ్ ఉనద్కట్, బ్రైడన్ కార్సే, కమిందు మెండిస్, అనికేత్ వర్మ, ఎషాన్ మలింగ, హర్ష్ దూబే, స్మరణ్ రవిచందరన్

**రిలీజ్డ్:**

అభినవ్ మనోహర్, అథర్వ తైడే, సచిన్ బేబీ, వియాన్ ముల్డర్, సిమర్జీత్ సింగ్, రాహుల్ చాహర్, ఆడమ్ జంపా

**ట్రేడ్ ఔట్:** మహ్మద్ షమీ

**ముంబయి ఇండియన్స్**

**రిటైనెడ్:**రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య, గజన్‌ఫర్, అశ్వని కుమార్, కార్బిన్ బాష్, దీపక్ చాహర్, జస్ప్రీత్ బుమ్రా, మయాంక్ మార్కండే (ఇన్), మిచెల్ సాంట్నర్, నమన్ ధీర్, రఘు శర్మ, రాజ్ బావా, రాబిన్ మిన్జ్, ర్యాన్ రికెల్టన్, శార్దూల్ ఠాకూర్ (ఇన్), రూథర్‌ఫోర్డ్ (ఇన్), సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, ట్రెంట్ బౌల్ట్, విల్ జాక్స్

**రిలీజ్డ్:** బెవాన్ జాకబ్స్, కరణ్ శర్మ, శ్రీజిత్, లిజాడ్ విలియమ్స్, ముజీబ్ ఉర్ రెహమాన్, రాజు, రీస్ టాప్లీ, విఘ్నేష్ పుత్తూరు

**ట్రేడ్ ఔట్:** అర్జున్ తెందుల్కర్

**రాజస్థాన్ రాయల్స్**

**రిటైనెడ్:**యశస్వీ జైస్వాల్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, వైభవ్ సూర్యవంశీ, శుభమ్ దూబే, యుద్ధ్వీర్ సింగ్, సందీప్ శర్మ, తుషార్ దేశ్‌పాండే, రవీంద్ర జడేజా (ఇన్), సామ్ కరన్ (ఇన్), డోనోవన్ ఫెరీరా (ఇన్), హిట్‌మయర్, ప్రిటోరియస్, జోఫ్రా ఆర్చర్, మఫాకా, నాంద్రే బర్గర్

**రిలీజ్డ్:** హసరంగ, తీక్షణ, ఫజల్ హక్, ఆకాశ్ మధ్వాల్, కుమార్ కార్తికేయ, కునాల్ రాథోడ్, అశోక్ శర్మ

**ట్రేడ్ ఔట్:**సంజు శాంసన్

**గుజరాత్ టైటాన్స్**

**రిటైనెడ్:** శుభ్‌మన్ గిల్, రషీద్ ఖాన్, సాయి సుదర్శన్, తెవాటియా, షారుక్ ఖాన్, రబడా, బట్లర్, సిరాజ్, ప్రసిద్ధ్, నిశాంత్ సింధు, కుషాగ్రా, అనుజ్ రావత్, సుతార్, వాషింగ్టన్ సుందర్, అర్షద్ షర్నర్, జయంత్, సరూర్ ఖాన్, సరూర్ యాదవ్, గ్లెన్ ఫిలిప్స్

**రిలీజ్డ్:** కరీం జనత్, కుల్జోలియా, కోయెట్జీ, శనక, లోమ్రోర్

**ట్రేడ్ ఔట్:** రూథర్‌ఫోర్డ్

**చెన్నై సూపర్ కింగ్స్**

**రిటైనెడ్:** సంజు శాంసన్ (ఇన్), రుతురాజ్, మాత్రే, బ్రేవిస్, ధోనీ, ఉర్విల్, శివమ్ దూబే, జామీ ఓవర్టన్, రామకృష్ణ ఘోష్, నూర్ అహ్మద్, ఖలీద్ అహ్మద్, అంషుల్ కాంబోజ్, గుర్జాప్నీత్, నాథన్ ఎల్లిస్, శ్రేయస్ గోపాల్, ముకేశ్ చౌదరి

**రిలీజ్డ్:** పతిరన, రాహుల్ త్రిపాఠి, ఆంద్రీ సిద్ధార్థ్, రచిన్ రవీంద్ర, హుడా, విజయ్ శంకర్, షేక్ రషీద్, కమలేశ్ నగర్‌కోటి

**ట్రేడ్ ఔట్:** జడేజా, శామ్ కరన్

**కోల్‌కతా నైట్‌రైడర్స్**

**రిటైనెడ్:** రింకూ సింగ్, వరుణ్ చక్రవర్తి, నరైన్, రహానే, హర్షిత్ రాణా, రమణదీప్, అంగారిష్ రఘువంశీ, అరోరా, పావెల్, మనీష్ పాండే, ఉమ్రాన్ మాలిక్, అనుకుల్ రాయ్

**రిలీజ్డ్:** రస్సెల్, మొయిన్ అలీ, నోకియా, డి కాక్, గుర్బాజ్, స్పెన్సర్ జాన్సన్, సిసోడియా, సకారియా, వెంకటేశ్ అయ్యర్

**ట్రేడ్ ఔట్:** మయాంక్ మార్కండే

**పంజాబ్ కింగ్స్**

**రిటైనెడ్:** శ్రేయస్ అయ్యర్, వధేరా, ఆర్య, శశాంక్, పైలా అవినాష్, హర్నూర్, ముషీర్ ఖాన్, ప్రభ్‌సిమ్రన్, విష్ణు వినోద్, స్టోయినిస్, మార్కో జాన్సెన్, ఒమర్జాయ్, సూర్యాంశ్, మిచెల్ ఓవెన్, విజయ్, బార్లెట్, లాకీ ఫెర్గూసన్, యుజ్వేంద్ర చాహల్, హర్‌ప్రీత్ బ్రార్

**రిలీజ్డ్:** జోష్ ఇంగ్లిస్, ఆరోన్ హార్డీ, మాక్స్‌వెల్, కుల్దీప్ సేన్, ప్రవీణ్ దూబే

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు**

**రిటైనెడ్:** రజత్ పాటిదార్, విరాట్ కోహ్లీ, పడిక్కల్, టిమ్ డేవిడ్, ఫిల్ సాల్ట్, జితేశ్ శర్మ, బెథెల్, కృనాల్ పాండ్య, షెపర్డ్, అభినందన్ సింగ్, హేజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్, రసిఖ్, సుయాష్ శర్మ, స్వప్నిల్, నువాన్ తుషారా

**రిలీజ్డ్:** స్వస్తిక్, మయాంక్ అగర్వాల్, సీఫెర్ట్, లివింగ్‌స్టోన్, మనోజ్, ఎన్‌గిడి, ముజారబానీ, మోహిత్ రాథీ

**ఢిల్లీ క్యాపిటల్స్**

**రిటైనెడ్:**స్టార్క్, నితీశ్ రాణా (ఇన్), రాహుల్, నటరాజన్, కరుణ్ నాయర్, సమీర్ రిజ్వీ, అశుతోష్, ముకేశ్ కుమార్, విప్రజ్ నిగమ్, చమీర, అజయ్ మండల్, త్రిపురాన విజయ్, మాధవ్ తివారీ, అక్షర్ పటేల్, కుల్దీప్ పి., త్రిస్తానీకుబ్

**రిలీజ్డ్:** ఫాఫ్, మెక్‌గుర్క్, అటల్, మన్వంత్, మోహిత్ శర్మ, దర్శన్ నల్కండే

**ట్రేడ్ ఔట్:** ఫెరీరాజి

**లఖ్‌నవూ సూపర్ జెయింట్స్**

**రిటైనెడ్:** నికోలస్ పూరన్, మయాంక్ యాదవ్, మొహ్సిన్, బదోని, రిషభ్ పంత్, మార్క్రమ్, మిచెల్ మార్ష్, అవేష్, అబ్దుల్ సమద్, హిమ్మత్, సిద్ధార్థ్, దిగ్వేష్, షాబాజ్ అహ్మద్, ఆకాష్ సింగ్, ప్రిన్స్ యాదవ్, అర్షిన్, బ్రిట్జ్, మహ్మద్ షమీ (ఇన్), అర్జున్ తెందుల్కర్ (ఇన్)

**రిలీజ్డ్:** ఆర్యన్ జుయల్, డేవిడ్ మిల్లర్, యువరాజ్ చౌదరి, హంగర్గేకర్, ఆకాష్ దీప్, రవి బిష్ణోయ్, షమర్ జోసెఫ్

**ట్రేడ్ ఔట్:** శార్దూల్ ఠాకూర్



## ఘనంగా బిర్సా ముండా జయంతి వేడుకలు..

### నివాళులు అర్పించిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

గిరిజన హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా జయంతి వేడుకలను గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం వేడుకలు నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, బిర్సా ముండా చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. గిరిజన హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా అని కొనియాడారు. ఇక్కడ డీటీడబ్ల్యూఓ సంగీత, ఏఓ రాంరెడ్డి, డీఎం డబ్ల్యూఓ భారతి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, ఎల్డీఎం మల్లికార్జున రావు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే హామీ నిలబెట్టుకోవాలి..

- ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోండి అమాత్య అని అడ్డుకున్న గ్రామ యువకుడు



**బలగం టీవీ ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో గత కొన్ని రోజుల క్రితం నిర్వహించిన ఎమ్మెల్యే ఆన్ వీల్స్ అనే కార్యక్రమంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోండి ఆమాత్య అని గ్రామ యువకుడు ఏబీవీపీ నాయకుడు అక్కేమ్ నాగరాజు ఎమ్మెల్యే కవ్వం పల్లి ని ప్లకార్డ్ చూపిస్తూ ఆయన వాహనానికి అడ్డుపడి నిరసన వ్యక్తం చేసాడు. వాహనం దిగిన ఎమ్మెల్యే కవ్వం పల్లి కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే పనులు జరగడం లేదని సమాధానం తెలిపి వెళ్లిపోయారు. అనంతరం అప్రమత్తమైన పోలీసులు యువకుడిని పక్కకు నెట్టి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా గ్రామ యువకుడు నాగరాజు మాట్లాడుతూ.. మండలంలో మొట్టమొదటి సారి ఎమ్మెల్యే ఆన్ వీల్స్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసి గ్రామంలో ప్రధాన సమస్య ఐన అసంపూర్తిగా ఉన్న బిక్కావాగు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తానని మాట ఇచ్చిన ఎమ్మెల్యే సంవత్సర కాలం దాటిన పట్టించుకోవడం లేదని అయన ఆవేదన వ్యక్తం చేశారు. హామీలు తప్ప ఆచరణలో నాయకులు ముందుండటం లేదని రానున్న రోజుల్లో ప్రజలు గుణపాఠం చెప్పక తప్పదని మండిపడ్డారు. ఈ కార్యక్రమం లో గ్రామ యువకులు వొళ్ళాల మధు, ఉతకం వెంకటేష్, విన్ను, అల్లెపు కార్తీక్, అఖిల్, చొప్పరి నాగరాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బాలల దినోత్సవం..

**బలగం టీవీ, తంగళ్లపల్లి**

సరస్వతి విద్యానికేతన్ హై స్కూల్ ఇంగ్లీష్ మీడియం మండెపల్లిలో స్వయం పరిపాలన దినోత్సవం కరస్పాండెంట్ కొక్కుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులుగా భారతదేశనికి సేవలందించిన మహనీయుల వేషధారణలో విద్యార్థులు మమేకమై స్వయం పరిపాలన దినోత్సవం విజయవంతం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ గా శివకుమార్, డిస్టిక్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ లహరి వ్యవహరించారు. ఇట్టి కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ కొక్కుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ పూర్ణిమ మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పిల్లలను అభినందించారు.

## ఓవర్సీస్ మొబిలిటీ బిల్ పై 20న సదస్సు..

### తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం

**బలగం టీవీ, హైదరాబాద్**




విదేశాలకు వలస వెళ్లే భారతీయుల కోసం 1983 లో అమలులోకి వచ్చిన వలస చట్టానికి (ఎమిగ్రేషన్ యాక్టు) సమూల మార్పులు చేయడానికి, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఓవర్సీస్ మొబిలిటీ బిల్లు, 2025 ముసాయిదాను విడుదల చేసింది. ఈనెల 24 లోగా ఈ బిల్లుపై అభిప్రాయాలు, సూచనలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. ఈ నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఆధ్వర్యంలో ఈ బిల్లుపై ఈనెల 20న హైదరాబాద్ లో సదస్సు నిర్వహిస్తున్నట్లు కమిటీ ఛైర్మన్, అంబాసిడర్ డా. బిఎం వినోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి లు ఒక ప్రకటనలో తెలిపారు. హైబ్రిడ్ విధానంలో జరిగే ఈ సమావేశంలో తెలంగాణ ప్రవాసులు తమ వీలునుబట్టి వ్యక్తిగతంగా లేదా ఆన్‌లైన్ ద్వారా పాల్గొనవచ్చు.